నేటి నుంచి రైతు అమరవీరుల జ్యోతి యాత్ర

- కడివెండి నుంచి కేరళలోని త్రిసూర్ వరకు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎఐకెఎస్ అఖిల భారత మహాసభలు ఈ నెల 13 నుంచి 16 వరకు కేరళలోని త్రిసూర్‌లో జరగనున్నాయి. మహాసభల నేపథ్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్వగ్రామమైన కడవెండిలో డిసెంబర్ 5న అమరవీరుల జ్యోతి యాత్ర ప్రారంభమై... త్రిసూల్ పట్టణానికి చేరుకుంటుంది. మొదటి యాత్ర వీర తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య స్వగ్రామమైన కడివెండి నుంచి ప్రారంభమవుతుంది. ఈ యాత్రకు ఎఐకెఎస్ సహాయ కార్యదర్శి కృష్ణప్రసాద్, కేంద్ర కమిటీ సభ్యులు టి.సాగర్ నాయకత్వం వహిస్తారు. రెండవ యాత్ర తమిళనాడులోని కిజ్వెన్‌మణిలో ప్రారంభమవుతుంది. దీనికి ఎఐకెఎస్ సహాయ కార్యదర్శులు డాక్టర్ విజ్జుకృష్ణన్, ఎస్‌కె ప్రీజా నాయకత్వం వహిస్తారు. వ్యవసాయరంగం, రైతులు, అనుబంధ రంగాలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్న అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ పిలుపునిచ్చారు. జ్యోతి యాత్రలో రైతులు, వివిధ ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

317 జిఒను రద్దు చేయాలి

- ప్రగతి భవన్‌ను ముట్టడించేందుకు ఉపాధ్యాయుల యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

317 జిఒను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఉపాధ్యాయులు ప్రగతి భవన్‌ను ముట్టడించేందుకు యత్నించారు. వీరిని పోలీసులు అడ్డుకొని గోషామహల్, పంజాగుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రాత్రికి రాత్రే అసంబద్ధంగా తీసుకువచ్చిన 317 జిఒతో ఎంతో మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు స్థానికతను కోల్పోయారని తెలిపారు. ఈ జిఒ వల్ల ఎంతోమంది వారి వారి స్థానిక జిల్లాలను వదిలి వేరే సుదూర ప్రాంత జిల్లాలకు వెళ్లారన్నారు. స్థానికత నినాదంగా ఏర్పడ్డ తెలంగాణలో తామందరం స్థానికత కోల్పోయి ఉన్న ఊరిని, కన్నవారిని, ఆస్థిపాస్తులను వదిలి ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిఒతో ఎంతో మంది మనోవేదనకు గురై ఆత్మబలిదానాలు చేసుకున్నారని, తామంతా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని చెప్పారు. జిఒను వెంటనే రద్దు చేసి తమను తమ స్థానిక జిల్లాలకు పంపించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేసి స్థానికతను సాధించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సంక్షేమంలో తెలంగాణకు పోటీలేదు

- ప్రభుత్వ యంత్రాంగం కృషితోనే ప్రగతి
- పదవులు శాశ్వతం కాదు.. పనితీరుతోనే సంతృప్తి
- టీం వర్క్‌తో పనిచేస్తేనే అద్భుత ఫలితాలు
- మహబూబ్‌నగర్ సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో సిఎం కెసిఆర్

కలెక్టరేట్ భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్షేమంలో తెలంగాణకు ఏ రాష్ట్రం పోటీరాలేదని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. ఏడేళ్ల క్రితం కేవలం 60 వేల కోట్ల రూపాయలు బడ్జెట్ ఉండే నేడు రెండున్నర లక్షల కోట్లకు చేరిందని, ఇదంతా ప్రభుత్వ యంత్రాంగం కృషితోనే సాధ్యమైందని ఆయన తెలిపారు. విద్యుత్, ఐటి,పరిశ్రమలు, వ్యవసాయం ఇలా అనేక రంగాల్లో తెలంగాణ దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని చెప్పారు. ఇంతటి గొప్ప అద్భుత ఆవిష్కరణలలో కృషి చేసినందుకు ఉద్యోగులు, సిబ్బంది అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నానని కెసిఆర్ తెలిపారు. మహబూబ్‌నగర్ సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని సిఎం కెసిఆర్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులనుద్దేశించి మాట్లాడారు. నాడపెండిపోయిన పాలమూరు నేడు ధాన్యరాశులతో నిండిపోతున్నదని సిఎం సంతోషం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమ కాలంలో పాలమూరు జిల్లాలో పర్యటించినప్పటి అనుభవాలు, జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులను వివరించారు. మనం చేసే మంచి పనులే మనకు జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చే ఆస్తులుగా మిగిలిపోతాయని పేర్కొన్నారు.

"మనం ఎవ్వలం కూడా వెయ్యి సంవత్సరాలు బతకడానికి రాలేదు, భగవంతుడు ఇచ్చిన అవకాశాన్ని బట్టి ఒకతను అటెండర్ పని చేయవచ్చు, ఒకాయన ఎమ్మార్వో కావచ్చు,. ఆర్‌డిఒ కావచ్చు, జాయింట్ కలెక్టర్, చీఫ్ సెక్రటరీ కావచ్చు , మంత్రి , ముఖ్యమంత్రి కావచ్చు. ఇవి శాశ్వతం కాదు. ఎవరంకూడ అధికారంలో పొద్దాక ఉండం. ఒక స్టేజ్ తర్వాత రిటైర్డ్ కావాల్సిందే.. కాని మనం ఉన్నప్పుడు ఏం చేసినం అన్నదే అంతిమంగా మనకు అద్భుతమైనటువంటి వేల, లక్షల కోట్ల ఆస్తికి సమానమైనటువంటి సంతృప్తినిస్తుంది" అన్నారు.

మహనీయుడు పివి చూపిన మార్గంలోనే గురుకులాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని బిసి రెసిడెన్షియల్ స్కూల్స్ విస్తృత పరచాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఆ సంఖ్యను 3-4 రెట్లు పెంచుకుందామని అన్నారు.

చిల్లరమల్లర రాజకీయాలు, ఓట్ల కోసం కంటి వెలుగు కార్యక్రమం తీసుకురాలేదని చెప్పారు. రెండోదశ కార్యక్రమమూ చేపట్టబోతున్నామని జిల్లా కలెక్టర్లు, అధికారులు విజయవంతం చేయాలని సిఎం కోరారు. పేదింటి మహిళలను దృష్టిలో పెట్టుకుని తీసుకు వచ్చిందే కెసిఆర్ కిట్ అనే కార్యక్రమం అని సిఎం అన్నారు. ఇనిస్టిట్యూషనల్ డెలివరీలు పెరిగేలా అమ్మ ఒడి వాహనాలను తీసుకువచ్చామని వివరించారు.

మానవీయ దృక్పథంతో.. ప్రజలకు మేలు జరుగాలనే లక్ష్యంతోనే కార్యక్రమాలు అమలుచేస్తున్నామని కెసిఆర్ చెప్పారు. మానవజాతి భూమిపై ఉన్నన్ని రోజులు సంస్కరణలు కొనసాగుతాయన్నారు. కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మేధోమధనం చేసి కొత్త సంస్కరణలు అమలులోకి తీసుకువస్తేనే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు.

సమావేశంలో మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్ , సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి , వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ , కలెక్టర్ ఎస్ వెంకట రావు, ఎంపి లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమాజ సంక్షేమాన్ని కాలరాస్తున్న బిజెపి

- విద్యారంగంలో అశాస్త్రీయ భావనలు సమాజానికి మంచిది కాదు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం ఫెడరలిజాన్ని, లౌకికత్వాన్ని, సమాజ సంక్షేమాన్ని కాలరాస్తోందని, రాష్ట్ర హక్కులను హరించివేస్తోందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం టిఎస్‌యుటిఎఫ్ 4వ విద్యా వైజ్ఞానిక సదస్సు కిషోర్‌సింగ్ అధ్యక్షతన ఆదివారం మణుగూరు పట్టణంలోని నాగటి నారాయణ ప్రాంగణంలో (జెడ్‌పి కో ఎడ్యుకేషన్ పాఠశాల) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీతో పాటు ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు, బిఆర్‌ఎస్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయాలని, ఒపిఎస్ పునరుద్ధరించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని బలోపేతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు కార్పొరేట్ సంస్థలకు దోచి పెడుతుందని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాభత్యాలు ఇవ్వడంలో మోసం చేస్తుందన్నారు. కోఠారి కమీషన్ విధానాలను అమలు చేసి బడ్జెట్‌లో పది శాతం నిధులు కేటాయించాలన్నారు. జ్యోతిష్యం, అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాలు విద్యా వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతుందన్నారు. మూఢ నమ్మకాలు లేని విద్య శాస్త్రీయ ఆలోచనలు పెంచే విద్య, సమాజాభివృద్ధిని పెంపొందిస్తోందన్నారు. సమాజంలో రుగ్మతలు ఇంకా తొలగిపోలేదని, విద్యారంగం వల్లే మూఢనమ్మకాలు తొలగించబడతాయని తెలిపారు. కేరళ తరహా విద్యా విధానాన్ని రాష్ట్రంలో ప్రవేశపెట్టాలన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్నారు. పాఠశాలలు మూతపడటానికి ప్రభుత్వ విధానాలే కారణమని, దానికి ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం సరికాదన్నారు. సామాజిక అంతరాలు తొలగించాలంటే విద్యను అభివృద్ధి చేయాలన్నారు. ముందుగా పట్టణంలో సంఘం సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిఇఒ సోమశేఖరశర్మ, ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, జిల్లా అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎం సాయిబాబు

కార్మికుల హక్కులను హరిస్తున్న కేంద్రం

- సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికుల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తుందని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు విమర్శించారు. సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో మహాసభ పట్టణంలోని లహరి ఫంక్షన్ హాల్ (కారంగుల వినోద్‌రావు ప్రాంగణం)లో ఆదివారం ప్రారంభమైంది. ముందుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి వందలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో సాయిబాబు కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సిఐటియు 52 సంవత్సరాలుగా దేశంలో ఆర్థిక, సామాజిక సమస్యలపై రాజీలేని పోరాటాల నిర్వహిస్తున్నదన్నారు. సిరిసిల్ల జిల్లాలో కార్మికుల హక్కుల పోరాటాల చాంపియన్‌గా పోరాడుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో కార్మిక శక్తి దేశ, రాష్ట్ర పాలకులకు తెలిసేలా సమిష్టి ఉద్యమాలకు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్.రమ, కూరపాటి రమేష్, మూషం రమేష్, జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులదే అడవి

- పోడు భూములకు పట్టాలివ్వాలి
- శ్రీనివాసరావు హత్యను ఖండించిన వామపక్ష బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసుల బతుకు అడవితోనే ముడిపడి ఉందని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు అవునూరి మధు, సిపిఐ(ఎంఎల్, ప్రజా పంథా) నాయకులు మాచర్ల సత్యం, సిపిఐ ఎంఎల్ ఎన్‌డి(రాయల వర్గం) నాయకులు ఎల్ విశ్వనాథం అన్నారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని బెండలపాడు గ్రామ పంచాయతీలోని ఎర్రబోడు గ్రామాన్ని వామపక్ష నాయకులు సందర్శించారు. ఫారెస్ట్ ఆఫీసర్ శ్రీనివాసరావు హత్య గురించి ఆరా తీశారు. పోడు భూములను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అడవిలో 89 రకాల ఖనిజ సంపదలున్నాయని, వాటిని వారు కాపాడుతున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడవి సంరక్షణ పేరుతో ఆదివాసీ జీవితాలతో ఆడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టం, పీసా, 1/70 చట్టాలు అడవికి అండగా, రక్షణగా ఉన్నాయని తెలిపారు. ఎర్రబోడు వలస ఆదివాసీలను గ్రామం ఖాళీ చేయాలని ఫారెస్టు శాఖ అధికారులు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోడు భూములకు పట్టాలు ఇచ్చేంతవరకూ పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. మీకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, పోడు సాగుదారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికలకు భద్రత కల్పించాలి

- ఘోరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి : తమ్మినేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఇటీవల కాలంలో రాష్ట్రంలో మహిళలు, బాలికలపై పెరుగుతున్న లైంగిక దాడుల పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, మహిళా కమిషన్ వెంటనే స్పందించి బాధితులకు భద్రత, భరోసా కల్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థినిపై అక్కడి ప్రొఫెసర్ లైంగిక దాడికి పాల్పడ్డాడని, వరంగల్ లా విద్యార్థినిపై.. హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో నాలుగేళ్ల బాలికపై, మహబూబ్ నగర్ జిల్లా, బాలనగర్ మండలంలోని తండాలో 15ఏళ్ల బాలికపై సామూహిక లైంగిక దాడి.. ఇలాంటి దారుణాలు సభ్యసమాజాన్ని నివ్వెర పరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళాలపై ఏదో ఒక మూల ఇలాంటి నేరాలు, ఘోరాలు జరుగుతున్నాయని తెలిపారు. వెలుగులోకి రాని ఘటనలూ ఉండొచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. బాలికలు, మహిళలపై పెరుగుతున్న హింసను అరికట్టడానికి నిందితులకు వెంటనే శిక్షలు పడేట్టు చర్యలు తీసుకోవాలనీ, షిటీమ్స్ రాష్ట్రమంతా విస్తరింప చేసి పకడ్బందీగా భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులను అరికట్టడానికి ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలనీ, ప్రభుత్వం ప్రకటించిన హెల్ప్ లైన్ నెంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. స్త్రీ స్థాయిని దిగజార్చే అంశాలు, వ్యాఖ్యానాల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

మహాసభలో మాట్లాడుతున్న జూలకంటి

కాలకేయుల్లా దాడి చేస్తున్న బిజెపి

- డబుల్ ఇంజన్ అంటే.. కార్పొరేట్, ప్రభుత్వం కలిసి దోచుకోవడమే
- వేతనాలు, చట్టాల కోసం పోరాటాలు
- కార్మికులతో వెట్టి చేయిస్తున్న పాలకులు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులు, మోడీ, అమిత్‌షా లాంటి ప్రభుత్వ శక్తులు కలిసి దోచుకోవడమే డబుల్ ఇంజన్ సర్కార్ ఉద్దేశమని, ఈ రెండు శక్తులు కలిసి దేశాన్ని సర్వ నాశనం చేస్తూ... ఒకే జెండా, ఒకే ఎన్నిక, ఒకే పన్ను, ఒకే చట్టం, ఒకే మతం.. అంటూ బిజెపి దేశం మీదపడి కాలకేయుల్లా దాడి చేస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పిఎస్‌ఆర్ గార్డెన్ (సున్నం రాజయ్య నగర్) లో ఆదివారం జరిగిన తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రథమ మహాసభ జరిగింది. ముందుగా సంఘం జెండాను యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జంజిరాల శ్రీనివాస్ ఎగరవేశారు. అనంతరం జరిగిన సభలో జూలకంటి మాట్లాడుతూ.. అందరి కంటే ఎక్కువ కష్టపడి సంపదను సృష్టిస్తున్న రైతులు, కార్మికులు ఎక్కువ పేదరికాన్ని అనుభవిస్తుంటే, ఏ కష్టమూ చేయని కార్పొరేట్ శక్తులు మాత్రం దేశ సంపదనంతా దోచుకుంటున్నాయని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీనీ మోడీ అమలు చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని యువతను మోసం చేశారని, నల్లధనం తెచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున వేస్తానన్న మాట నీటి మూటైందన్నారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోడీ ప్రభుత్వం.. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం దుర్మార్గమన్నారు. నల్ల చట్టాలను రైతులు పోరాడి వెనక్కు కొట్టినట్లుగానే కార్మికులూ సంఘటితంగా పోరాడి లేబర్ కోడ్లను తిప్పికొట్టాలని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ నల్లా నీళ్ల ఇవ్వాలనే లక్ష్యంతో రూ.36 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేసిన మిషన్ భగీరథ పథకంలో 15 వేల మంది కార్మికులు, ఉద్యోగుల కుటుంబాలూ అంతే గొప్పగా ఉండే విధంగా వారికి కనీస వేతనాలివ్వాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వాలు వేసిన కమిటీలే ఒక కుటుంబం గడవడానికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పట్టించుకోకపోవడం సరైంది కాదని చెప్పారు. రోజుకు 12 గంటల పాటు దూర ప్రాంతాలకెళ్లి పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులకు ఆరేడు వేల జీతమిచ్చి కంపెనీలు దోపిడి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేటు కంపెనీలు ఇష్టమొచ్చిన రీతిన వేతనాలిచ్చి కార్మికుల్ని దోచుకుంటుంటే, రాష్ట్ర ప్రభుత్వం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమే అవుతుందన్నారు. చట్టబద్ధమైన సదుపాయాలు, కనీస వేతనాల కోసం కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలన్నారు. కార్మికుల పక్షాన ఎర్రజెండా, సిఐటియు జెండా ఎప్పుడూ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరి రాములు మాట్లాడుతూ.. కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ ప్రభుత్వం కాలరాస్తూ 12 గంటల పనివిధానాన్ని తెస్తుందని విమర్శించారు. లేబర్ కోడ్ల వల్ల కంపెనీలు, కార్పొరేట్ శక్తులకు మేలు చేకూరుతుందన్నారు. కార్మికులకు కనీసం యూనియన్ పెట్టుకునే హక్కు లేకుండా మోడీ ప్రభుత్వం చేస్తున్నాదన్నారు. సంఘటిత, అసంఘటిత రంగంలోని కార్మిక వర్గం ఐక్యంగా ఉద్యమించి కార్మిక చట్టాలను కాపాడుకోవాలన్నారు. సిఐటియు సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథ కార్మికులది 'ఎక్కువ కష్టం తక్కువ జీతం' అన్నారు. మహాసభలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జంజిరాల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సుధాకర్, వెంకన్న, రాములు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి దిగ్బంధించిన రైతులు

- పర్యావరణ అనుమతులు లేకుండా టెండర్లు పిలుస్తున్నారని ఆగ్రహం
- గ్రీన్ ఫీల్డ్ హైవేను బ్రౌన్ ఫీల్డ్ హైవేగా మార్చాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డుపై బైఠాయించిన రైతులు

గ్రీన్‌ఫీల్డ్ హైవేను బ్రౌన్ ఫీల్డ్ హైవేగా మార్చాలని డిమాండ్ చేస్తూ ఐదు జిల్లాల గ్రీన్ ఫీల్డ్ హైవే భూ బాధిత రైతులు వరంగల్ జిల్లా దామెర మండలం ఊరుగొండ వద్ద జాతీయ రహదారి 163ని దిగ్బంధించి భారీఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. గ్రీన్ ఫీల్డ్ హైవే ఊరుకొండ నుంచి మొగుళ్ళపల్లి వయా టేకుమట్ల, పెద్దపల్లి జిల్లా మీదుగా మంచిర్యాల జిల్లాలోని నార్వ వరకు, ఇటు విజయవాడ వరకు నిర్మించాలని ఉంది. దీనికి ఎలాంటి పర్యావరణ అనుమతులు లేకుండా నేషనల్ హైవే అధికారులు చట్ట విరుద్ధంగా బిడ్డింగ్ వేసి టెండర్లను పిలవడాన్ని నిరసిస్తూ ఖమ్మం, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలకు చెందిన రైతులు ఊరుకొండ వద్ద నేషనల్ హైవేను దిగ్బంధించారు. దాంతో రెండు గంటల పాటు భారీ ఎత్తున వాహనాలు నిలచిపోయాయి. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపచేశారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధి రాజగోపాల్ రావు మాట్లాడుతూ.. తమ భూములు గ్రీన్ ఫీల్డ్ హైవేకి ఎట్టి పరిస్థితిల్లో ఇవ్వబోమని తేల్చిచెప్పారు. బహిరంగ మార్కెట్లో కోటి నుండి రెండు కోట్ల రూపాయలు పలుకుతున్న తమ భూములను సంవత్సరానికి రెండు లేక మూడు పంటలు పండిస్తూ తాము జీవన భృతి పొందుతున్నటువంటి భూములను ఇవ్వబోమన్నారు .అప్రైజర్ కమిటీ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపిలను కలిసి అలాట్‌మెంట్ మార్చాలని తమ బాధను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రైతుల పక్షాన ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కర్‌ని కలిసి గ్రీన్ ఫీల్డ్ హైవేని బ్రౌన్ ఫీల్డ్ హైవేగా మార్చమని విన్నవించినప్పటికీ మార్పు చేయకుండా టెండర్లు పిలవడం సరైన విధానం కాదని అన్నారు. కార్యక్రమంలో బూర్గుల రామచంద్రరావు, రాజగోపాల్‌రావు, భద్రయ్య, వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, తిరుపతి, మొగిలి, బొల్లు సమ్మిరెడ్డి, బొల్లు రాజిరెడ్డి తదితర రైతు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మెస్ ఛార్జీలు, స్కాలర్ షిప్‌లు వెంటనే పెంచాలి

- విద్యార్థులతో మహాధర్నాలో ఎంపి ఆర్ కృష్ణయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థులతో మహాధర్నా చేస్తున్న ఎంపి ఆర్ కృష్ణయ్య

ఎనిమిది లక్షల మంది యూనివర్సిటీ, కాలేజీ, గురుకులాలు, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను వెంటనే పెంచాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీలపల్లి అంజి అధ్యక్షతన విద్యార్థులతో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్ల కిందటి ధరల ప్రకారం నిర్ణయించిన మెస్ చార్జీలు, స్కాలర్ షిప్‌లు ఇంకా కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం నిత్యావసర ధరలు మూడు రెట్లు పెరిగాయని, దాంతో హాస్టల్ మెనూ పాటించడానికి డబ్బులు సరిపోక గుడ్లు, పండ్లు తగ్గించారని తెలిపారు. అలాగే విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆలోచన రాకపోవడం దుర్మార్గమన్నారు. ఉద్యోగుల వేతనాలు రెండుసార్లు పెంచారని, శాసనసభ్యులు, మంత్రుల వేతనాలు మూడు రెట్లు పెంచారని, కానీ బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు మాత్రం పెంచడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ. 1500 నుంచి రూ. మూడు వేలకు, పాఠశాల హాస్టల్ విద్యార్థులకు రూ..950 నుంచి రూ.2000కు పెంచాలని డిమాండ్ చేశారు. బిసి జనాభా ప్రకారం అదనంగా 240 గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు. అలాగే బిసి కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. మహా ధర్నాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జెఎసి చైర్మెన్ నీల వెంకటేష్, నాయకులు రాజ్ కుమార్, పగిళ్ల సతీష్, అనంతయ్య, నిఖిల్, భాస్కర్ ప్రజాపతి, మల్లేష్, సందీప్, వంశీ పాల్గొన్నారు

లిక్కర్ స్కామ్‌లో సిఎం బంధువులున్నా శిక్ష పడాల్సిందే

- కేంద్ర మంత్రి రామదాస్ అథవాలే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో సిఎం బంధువులున్నా శిక్ష పడాల్సిందేననీ, ఎంతటివారున్నా కచ్చితంగా శిక్ష పడుతుందని సామాజిక న్యాయ, సాధికారత శాఖ కేంద్ర మంత్రి రామదాసు అథవాలే అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని బేగంపేటలోగల హరితప్లాజాలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో తమ పార్టీ బిజెపితోనే ఉంటుందన్నారు. త్వరలోనే రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ తీయబోతున్నామని ప్రకటించారు. కెసిఆర్‌ది ఇప్పటి వరకూ లోకల్ పార్టీ అనీ, ఇప్పుడే జాతీయ పార్టీ ప్రారంభించారని తెలిపారు. వేరే రాష్ట్రాల్లో ఆయనకు అస్సలు సపోర్టే ఉండదన్నారు. లిక్కర్‌స్కామ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ వాళ్లు కూడా ఉన్నారని ప్రచారం జరుగుతున్నదని చెప్పారు. ఆ స్కామ్‌లో ఎవరెవరు ఉన్నారనేది విచారణలో తేలుతుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరిగి ఎన్‌డిఎ కూటమిలో చేరాలని కోరారు. వైసిపి తమతో కలిసి వస్తే మరోసారి జగన్ సీఎం అవుతారన్నారు. బిజెపి-ఆర్‌పిఐతో కలిసి వైసిపి పోటీచేస్తే జగన్‌ను గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. వికలాంగుల సమస్యల పరిష్కారానికి తగిన విధంగా కృషి చేస్తానని కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక, యువార్డు ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సుమారుగా ఏడు శాతం మంది వికలాంగులు ఉన్నారన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. అన్ని రాష్ట్రాల్లో వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని సూచించారు.

బాలిక హత్యకేసులో దోషులను శిక్షించాలి : ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో పదోతరగతి బాలికపై బాబాయి వరుసైన వ్యక్తి మరో ఇద్దరితో కలిసి లైంగిక దాడికి పాల్పడి, చంపేయడం దారుణమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షులు అరుణజ్యోతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో రోజురోజుకీ లైంగిక దాడులు పెరిగిపోతుండడం బాధాకరమని తెలిపారు. భేటీ బచావో-భేటీ పడావో అనే నినాదం ఏమైందని మోడీ సర్కారును విమర్శించారు. బాలికపై లైంగికదాడి చేసి ఆమె మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రను అడ్డుకోవడం దుర్మార్గం : వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాదయాత్రకు హైకోర్టు అనుమతిచ్చినప్పటికీ పోలీసులు అడ్డుకోవడమేంటని వైఎస్ఆర్‌టిపి అధ్యక్షులు షర్మిల ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే మూడుసార్లు తన పాదయాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పాదయాత్రకు వస్తున్న జనాదరణ చూసి.. కెసిఆర్ ఓర్వలేక పోలీసుల ద్వారా తనపై ఒత్తిడి తీసుకువస్తున్నారన్నారు. మంత్రులే బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో అవినీతి జరుగుతున్నదని వివరించారు. తాను చేస్తున్న ఆరోపణలపై బహిరంగ విచారణకు సిద్ధమా? అని సవాల్ విసిరారు.

నేలమట్టమైన ఇళ్లు

గృహప్రవేశం నాడే ఇల్లు కూల్చివేత

- వివాదాస్పద స్థలం కావడమే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొన్ని గంటల్లో గృహ ప్రవేశం చేసుకోబోతున్నామన్న ఆ కుటుంబం సంతోషం నిమిషాల వ్యవధిలో ఆవిరైంది. వివాదాస్పద ప్లాట్ / స్థలంలో రెండు అంతస్థుల భవన నిర్మాణం చేపట్టారంటూ రెవెన్యూ అధికారులు ఆ ఇంటిని పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం తెల్లవారుజామున కూల్చివేశారు. రెవెన్యూ అధికారులు తెలిసిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామ రెవెన్యూ సర్వేనెం 44, 45 ప్లాట్ నెం.31 / స్థలం కోర్టు పరిధిలో ఉంది. ఆ స్థలంలో చెరుకు దేవి అనే వ్యక్తి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణం చేపట్టడంతో ఆయనకు పలు దఫాలుగా రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయినా నిర్మాణదారులు కింది స్థాయి సిబ్బందిని బెదిరిస్తూ అక్రమంగా నిర్మాణం చేపట్టారు. దాంతో ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ వెంకటాచారి ఆదేశాల మేరకు సిఆర్‌పిసి సెక్షన్ 145 ప్రకారం రెండంతస్తుల ఇంటిని కూల్చివేశారు. ఆ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం ఆదివారం జరగాల్సి ఉండగా.. అంతకంటే ముందే అధికారులు ఇంటిని కూల్చివేశారు. కూల్చివేతల సమయంలో డిప్యూటీ తహసీల్దార్ వేణు, ఆర్ఐ భిక్షపతి, రెవెన్యూ సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

భూ పోరాటంలో ఇబ్బందులు తప్పవు

- వరంగల్ ప్రజలు పోరాట యోధులు
- ప్రభుత్వ భూములు పేదలకు చెందాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య
- పోడుదారులకు పట్టాలు ఇవ్వాలి : వీరయ్య

బహిరంగ సభలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ పోరాటంలో పేదలు ఇళ్ల స్థలాలు కాపాడుకోవడంతో పాటు ఇంటి పట్టాలు, ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం పోరాడే క్రమంలో ప్రభుత్వంతో పాటు భూకబ్జాదారుల నుంచి ఇబ్బందులు తప్పవని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య అన్నారు. వాటి ఎదుర్కొంటూనే సమస్యల సాధనకు పోరాడుతున్న ప్రజలకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. గ్రేటర్ వరంగల్ మూడవ డివిజన్‌లోని పైడిపల్లి, కొత్తపేట భూపోరాట కేంద్రాలు వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు అక్కనపెల్లి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే ఇళ్లు, విద్యా వైద్యం ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఎనిమిదేళ్లు గడుస్తున్నా పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. విదేశాల్లో ఉన్న నల్ల డబ్బు వెనక్కి తెచ్చి ప్రతి పేద కుటుంబానికి రూ.15 లక్షల ఇస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 2014, 2019లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. వరంగల్ ప్రజలు పోరాటయోధులని, నాడు భూమిశిస్తుకు వ్యతిరేకంగా కాకతీయులపై పోరాడిన సమ్మక్క సారలమ్మ, అలాగే తెలంగాణ సాయుధ పోరాటంలో ఎంతో మంది వీరమరణం పొందాలని గుర్తు చేశారు.

ఆ పోరాట యోధుల స్ఫూర్తితో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. వరంగల్ నగరంలో జరిగిన భూ పోరాటంలో కుసుమ రఘునాథ్, రామ సురేందర్, సమ్మయ్య భూ కబ్జాదారుల చేతుల్లో దారణహత్యకు గురైనట్టు గుర్తుచేశారు. ప్రభుత్వ భూములను ఇండ్లు లేని పేదలకు పంచి వారికి పట్టాలిచ్చి ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వానికి పేదల గోడు వినే సమయం లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్యవసర సరుకులతో పాటు డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచిందన్నారు. కేంద్రం కనీస వేతన జిఒ రూ.4678 లుగా విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. భూమిపై పుట్టిన ప్రతి ఒక్కరికి గుడిసెలు వేసుకునే హక్కు ఉందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల గురించీ ఆలోచించాలని కోరారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములను న్యాయబద్ధంగా సర్వే చేయించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని భూ పోరాటాలు నిర్వహించాలని, అందుకు సిపిఎం పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్ రంగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సింగారపు బాబు, నళిగంటి రత్నమాల, ముక్కెర రామస్వామి, కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి ఎండి బషీర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శివార్లలో రేవ్‌పార్టీ భగ్నం

- పోలీసుల అదుపులో 34 మంది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోలీసులకు చిక్కకుండా కొందరు రేవ్‌పార్టీలను శివారు ప్రాంతాల్లోకి మార్చేశారు. గుట్టుచప్పుడుకాకుండా మాదక ద్రవ్యాలతో రేవ్ పార్టీలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి ఇంజినీరింగ్ విద్యార్థులు జరుపుకుంటున్న పుట్టినరోజు వేడుకల్లో గంజాయి సేవిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. 37 మందిలో 34 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ముగ్గురు గంజాయి సేవించి ఉన్నారన్న అనుమానంతో వారిని పోలీసులు ప్రశ్నించడంతో అసలు గుట్టు వెలుగు చూసింది. వారి నుంచి 50 గ్రాముల గంజాయి, పది కార్లు, ఓ ద్విచక్రవాహనం, 30సెల్‌ఫోన్లు, డీజేసౌండ్ సిస్టమ్‌తోపాటు మద్యం బాటిళ్లు తదితర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమాల అడ్డాగా ప్రగతి భవన్

- ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రగతి భవన్ అక్రమాలకు అడ్డాగా మారిందని మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... సిబిఐ, ఇడి, ఎసిబి నోటీసులు అందుకున్న వారు, తప్పు చేసిన వారు, టెండర్లు కావాలనుకునే వారు, అక్రమాలు చేయాలనుకునేవారు, టర్మినేట్ అయిన అధికారులు, భూ దందాలు, ల్యాండ్, శాండ్ మాఫియాకి ప్రగతిభవన్ కేంద్రంగా మారిందని విమర్శించారు. గ్రానైట్ కంపెనీలకు సంబంధించి నోటీసులు అందుకున్న వ్యక్తులు సిఎం కెసిఆర్‌తో కేసుల నుంచి ఎలా తప్పించుకోవాలనే చర్చలు జరిపేందుకు ప్రగతిభవన్ వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలకు ఎర విషయంలో నలుగురు ఎమ్మెల్యేలు 20 రోజులపాటు ప్రగతి భవన్‌లోనే దాక్కున్నారని చెప్పారు. సిబిఐ నోటీసులు అందుకున్న ఓ మహిళ భవిష్యత్ కార్యాచరణపై అనేక నిర్ణయాలు తీసుకునే నిలయంగా ప్రగతిభవన్ మారిందన్నారు. మియాపూర్, హాఫీజ్‌పేట భూములకు సంబంధించిన వివాదం సమయంలో కూడా ఇలాగే చేశారని తెలిపారు. శాఖ, పాలనాపరమైన సమీక్షలను పక్కన పెట్టేశారని తెలిపారు. సామాన్యులు ప్రగతిభవన్‌కు వెళ్లాలన్నా, ముఖ్యమంత్రిని కలవాలన్నా అవకాశం లేకుండా పోయిందన్నారు. సామాన్యులను కలవని కేసీఆర్.. అవినీతి, తప్పులు చేసిన వారిని ఎలా కలుస్తున్నారు? అని ప్రభాకర్ ప్రశ్నించారు.

బండి సంజయ్‌కి ప్రశ్నించే నైతిక అర్హత లేదు

- బిజెపి ఉద్యోగాలివ్వదు...కనీస వేతనాలు అమలు చేయదు
- కేరళ సర్కారు పాలనలో కనీస వేతనాల అమలు
- సిఐటియుకే ప్రశ్నించే హక్కు ఉంది...
- టియుఎంహెచ్ఇయు మహాసభలో జె వెంకటేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కేంద్రంలో ఉన్న బిజెపి సర్కారు పోస్టుల ఖాళీలను భర్తీ చేయదు. కనీస వేతనాలను డిమాండ్ చేస్తున్న అమలు చేయదు. కార్మిక హక్కులను హరిస్తూ నాలుగు కోడ్లను తెస్తోంది. ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తోంది. రాష్ట్ర విభజన హామీల అమలును పట్టించుకోదు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాత్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఖాళీలు భర్తీ చేయరెందుకని ప్రశ్నిస్తుంటారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఖాళీలు భర్తీ చేయకుండా రాష్ట్రంలో టిఆర్ఎస్ సర్కారును ప్రశ్నించే నైతిక అర్హత ఎలా ఉంటుంది. కేరళలోని ఎర్రజెండా సర్కారు రూ.18 వేల కనీస వేతనాలను అమలు చేస్తోంది. కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేలా చట్టాన్ని రూపొందించే పనిలో ఉంది. చివరకు అగ్నిపథ్ పేరుతో సైన్యంలో కాంట్రాక్ట్ వ్యవస్థను తెచ్చిన ఘనత బిజెపిదని అన్నారు. అందుకే కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో టిఆర్ఎస్‌ను ప్రశ్నించే అర్హత తమకే ఉందని".... సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్ తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు భూపాల్ అధ్యక్షతన ఆదివారం మూడో మహాసభ నిర్వహించారు. ఈ సభను వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యరంగానికి బడ్జెట్‌లో కనీసం ఆరు శాతం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ కనీసం ఒక శాతం కేటాయించలేదని విమర్శించారు. బిజెపి హిందుత్వ పేరుతో విభజన రాజకీయాలు చేస్తూ, ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తోందని తెలిపారు. ఆ పార్టీ దృష్టిలో హిందువులందరు సమానం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంట్రాక్టు వ్యవస్థ రద్దు కోసం పోరాడాల్సిన అవసరముందని చెప్పారు. రాష్ట్రంలో కార్మికుల కనీస వేతనాలను టిఆర్ఎస్ సర్కారు పెంచడం లేదని విమర్శించారు. సిఎం కెసిఆర్ యాజమాన్యాల పక్షమా? లేక కార్మికుల పక్షమా? నిర్ణయించుకోవాలని తెలిపారు. వైద్యారోగ్యరంగ సిబ్బంది సమస్యలు పరిష్కరించకుండా టిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాలేదన్నారు. ఇది పోరాటానికి అనుకూల సమయమనీ, ఆ మేరకు ఉద్యోగులు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. హైకోర్టు అడ్వొకేట్ మూర్తి మాట్లాడుతూ రెగ్యులరైజేషన్‌కు సంబంధించి చట్టపరమైన అంశాలు, కోర్టుల తీర్పులను వివరించారు. పదేండ్లు పని చేసిన వారిని పర్మినెంట్‌గానే పరిగణించాల్సి ఉంటుందని తెలిపారు. ఇందుకోసం పోరాటాలు చేయాలనీ, చివరి అస్త్రంగా న్యాయస్థానాలను ఆశ్రయించాలని సూచించారు. హైకోర్టు అడ్వొకేట్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు.

ఉమ్మడి రాష్ట్రంలో యూనియన్ అధ్యక్షురాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్.రోజారాణి మాట్లాడుతూ పోరాటాలు వృధా పోవనీ, ఫలితాలిస్తాయని తెలిపారు. హైదరాబాద్ ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో యూనియన్ ఏర్పాటై ఏడాది కాలమే అయినా పది మందికి పైగా ఉద్యోగులకు లేబర్ కోర్టు వరకు వెళ్లి ఉద్యోగ భద్రత కల్పించిదని గుర్తుచేశారు. ఐక్యంగా ఉంటూ, మహిళలు యూనియన్‌లో నిర్ణయాత్మక కమిటీలలో బాధ్యతలు చేపట్టాలని సూచించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యాదానాయక్ తీర్మానాలను ప్రవేశపెట్టారు. కాంట్రాక్ట్ పారామెడికల్, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను ఎలాంటి షరతులేకుండా యధావిధిగా రెగ్యులరైజ్ చేయాలి. ఇందు కోసం అవసరమైతే చట్ట సవరణ చేయాలి. పని ఒత్తిడి తగ్గించాలి. సెలవు దినాల్లో పని చెప్పకూడదు. సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. వేతన సవరణకమిటీని నియమించి జూలై ఒకటి నుంచి రెండో పీఆర్‌సీని అమలు చేయాలి. పెండింగ్‌లో ఉన్న మూడు డిఎలను వెంటనే విడుదల చేయాలి. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు 240 రోజులివ్వాలని మహాసభ తీర్మానించింది. ఈ మహాసభలో యూనియన కోశాధికారి మహమ్మద్ ఫసియుద్దీన్, నాయకులు మరియమ్మ, కవిత, బలరాం, సుధాకర్, సంజూ జార్జ్, వీరయ్య, వెంకటేష్, మీనా, శ్రావణ్ కుమార్, కుమారస్వామి, చంద్రమోహన్, రాజు, శ్రీనివాస్, భాస్కర్, నవీన్ కుమార్, విజయలక్ష్మి, సరోజన, విజయవర్ధన్ రాజు పాల్గొన్నారు.

క్లినికల్ ట్రయల్స్‌లో దూసుకెళ్తున్నాం..

- వైజాగ్‌లో సిఆర్ఒను ప్రారంభించాం
- కొత్తగా పెద్ద జంతువులపై పరిశోధనలు
- విఒ బయోటెక్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వి చంద్ర శేఖర్ పట్నాయక్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

" సాధారణంగా జ్వరమో, తల నొప్పో వస్తే వెంటనే మెడికల్ షాపునకు వెళ్లి ఓ మందు గోలి తీసుకుని వేసుకుంటాము. ఔషధాల తయారీలో ఎన్నో దశలు ఉంటాయి. మందు తయారీ కోసం అధ్యయనం, ఫార్ములా, తయారీ, ట్రయిల్స్ ఇలా..అన్ని దశలు దాటి మెడిసిన్ మార్కెట్‌లోకి వస్తుంది. వాటితో వచ్చే చెడు ప్రభావాలు, సైడ్ ఎఫెక్ట్స్‌ను గుర్తించడంతో పాటుగా వాటి పని విధానంపై సర్టిఫికేషన్ ఇచ్చే కాంట్రాక్టు రీసెర్చ్ ఆర్గనైజేషన్ (సిఆర్ఒ) క్లినికల్ ట్రయల్స్‌లో మా సంస్థ దూసుకెళ్తోంది." అని వివో బయోటెక్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ వి చంద్ర శేఖర్ పట్నాయక్ తెలిపారు. "ఆయా ఉత్పత్తిని బట్టి కొన్ని నెలలు, సంవత్సరాల పాటు జరిగే ఇలాంటి సిఆర్ఒ క్లినికల్ ట్రయల్స్‌లో రాణిస్తున్నాం.. అనేక ఔషధ, వ్యవసాయ పురుగు మందులు, పారిశ్రామిక రసాయనాలు, ప్యాకేజింగ్ తదితర కంపెనీల ఉత్పత్తులకు క్లినికల్ ట్రయల్స్ నిర్వహించే జిఎల్‌పి ల్యాబ్‌ల్లో వివో బయోటెక్ లీడింగ్‌లో ఉంది. దేశంలో 52 జిఎల్‌పి ల్యాబ్‌లు మాత్రమే ఉండగా.. అందులో మా సంస్థ ఒక్కటి. అదే విధంగా అనేక జిఎల్‌పిలకు వేలాది జంతువులను సరఫరా చేస్తున్న సంస్థల్లో వివో బయోటెక్ టాప్‌లో ఉంది." అని చంద్ర శేఖర్ ప్రజాశక్తి పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ వివరాలు..

మీ సంస్థ స్థాపన గురించి చెప్పండి..?

- 2009లో విఒ బయోటెక్‌ను ప్రారంభించాం.

టాకోనిక్ బయోసైన్సెస్ భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేశాము. హైదరాబాద్ శివారు శామీర్‌పేట్ సమీపంలో పరిశోధన కేంద్రాన్ని అభివృద్ధి చేశాము. దేశంలో 52 ప్రీ క్లినికల్ ట్రయల్స్ జిఎల్‌పిలు ఉన్నాయి. అందులో విఒ బయోటెక్ ఒక మేజర్ ఇన్‌స్టిట్యూట్. ప్రస్తుతం 280 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇందులో 90 మంది శాస్త్రవేత్తలు ఉన్నారు. ఒఇసిడి-జిఎల్‌పి, ఎఎఎల్ఎసి నిబంధనలకు అనుగుణంగా సంస్థ పని చేస్తోంది. ఇటీవలే వైజాగ్‌లోనూ కొత్త కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ఇక్కడ పెద్ద జంతువులపై సిఆర్ఒ క్లినికల్ ట్రయల్స్‌ను అందుబాటులోకి తెచ్చాం. శామీర్‌పేట్ సమీపంలోని ప్రజ్ఞాపూర్‌లో ఫామ్ ఉంది. ఇక్కడ వైద్య పరిశోధనలకు కావాల్సిన ఎలుకలు, కుందేళ్లు, పందులు తదితర అనేక జంతువులు సహా పక్షులు, నీటి జీవాలను పెంచుతున్నాం.

ఎవరెవరికీ సేవలందిస్తారు..?

- ఫార్మాస్యూటికల్, అగ్రో కెమికల్, పారిశ్రామిక రసాయనాలు, మెడికల్ ఉపకరణాలు, కస్మోటిక్స్ తదితర ప్రధాన పరిశ్రమలకు సంబంధించిన కంపెనీల ఉత్పత్తులకు ప్రయోగాలు చేస్తాము. ఒక ఉత్పాదన మార్కెట్‌లోకి రావడానికి ముందు అనేక క్లినికల్ ట్రయల్స్ జరుగుతాయి. ఖచ్చితత్వం కోసం ఈ ప్రక్రియ పలు జిఎల్‌పి సెంటర్లలో నిర్వహిస్తారు. వారి ఉత్పత్తులకు క్లినికల్ ట్రయల్స్ చేసి.. నిర్ధారణ సర్టిఫికెట్లను జారీ చేస్తాం. టాక్సికాలజీ, ఫార్మాకోలాజికల్ ఇన్వెస్టిగేషన్స్, ఫార్మాకోకినెటిక్, కాస్మోటిక్స్ సేవలందిస్తున్నాం.

మీ ప్రత్యేకత ఏమిటి..?

- సాధారణంగా మనుషులు పలు లోపాలతో జన్మిస్తుంటాయి. అలాంటి వ్యక్తులకు వైద్యం అందించాలంటే వారికి సంబంధించిన లోపాలపైన తొలుత పరిశోధన జరగాలి. ఉదాహరణకు ఓ వ్యక్తి చెవుడుతో జన్మించారని అనుకుందాం. ఆ లోపాన్ని సరిదిద్దాలంటే తొలుత చెవుడు కలిగిన జంతువులపై ఆ వ్యాధికి సంబంధించిన వ్యాధిపై పరిశోధన జరగాలి. అలాంటప్పుడు చెవుడు కలిగిన జంతువులను మనమే సృష్టించాల్సి ఉంటుంది. ఇలా చేయడానికి కొన్ని జీన్స్‌ను తొలగించి.. అలాంటి జంతువులను సృష్టిస్తాము. ఇది మాకు ఓ పెద్ద సవాల్. చైనాకు చెందిన సియార్జిన్ కంపెనీ భాగస్వామ్యంతో విజయవంతంగా ఈ విభాగంలో రాణిస్తున్నాము. మనుషుల శారీరక ప్రొఫైల్ కాకుండా.. భారత్‌లో ఎవరూ చేయని విధంగా జంతువుల వైద్య ప్రొఫైల్‌ను తయారు చేస్తున్నాము.

రెవెన్యూ ఎలా వస్తోంది..?

ఔషధ, అగ్రో, రసాయనాలు, మెడికల్ ఉపకరణాలకు సంబంధించిన అనేక కంపెనీల ఉత్పత్తులపై మా వద్ద ట్రయల్స్ జరుగుతాయి. ఆ రంగాలకు సంబంధించిన అనేక కంపెనీలు మమ్మల్ని సంప్రదిస్తాయి. ఉదాహరణకు.. ఓ కంపెనీ స్టెతస్కోప్‌ను అందుబాటులోకి తెచ్చేముందూ విస్తృత ట్రయల్స్ జరుగుతాయి. స్టెతస్కోప్‌కు ఉపయోగించే రబ్బర్‌తోనూ ప్రజలకు ఎమైనా ఇబ్బందులు, దాని ఖచ్చితత్వం, చర్మ ఎలర్జీని ఎమైనా కల్పిస్తాయనే ట్రయల్స్ జరుగుతాయి. దీనిపై పలు ట్రయల్స్ జరిగిన తర్వాతే ఆ ఉత్పత్తి తయారికి వెళ్తుంది. ఆ కంపెనీలు ఇచ్చే ఉత్పత్తులపై మేము చేసే పరిశోధనలకు ఆ సంస్థలు కొంత సొమ్మును మాకు చెల్లిస్తాయి. ప్రీ క్లినికల్ సిఆర్ఒల కోసం ఇతర జిఎల్‌పిలకు జంతువులు, పక్షులను సరఫరా చేస్తాము.

ప్రతీ నెలకు 25-30వేల జంతువులను విక్రయిస్తాము. క్లినికల్ ట్రయల్స్‌కు ఉపయోగించే పలు రకాల ఎలుకలు, పందులు, కుక్కలు, మేకలు, పందులు తదితర వాటిని ఉత్పత్తి చేస్తున్నాము.

మీ సంస్థ టర్నోవర్ ఎంత..?

విఒ బయోటెక్ 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.52 కోట్ల టర్నోవర్ సాధించింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ.72 కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఈ ఏడాది నుంచి పెద్ద జంతువులపైన ప్రయోగాలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో మెరుగైన వృద్ధిని కనబర్చనున్నామనే విశ్వాసంలో ఉన్నాము. కొత్తగా పెట్టే విభాగాల వల్ల మరో వంద మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది.

మీ ఎగుమతుల గురించి చెప్పండి..?

మా మొత్తం వ్యాపారంలో 20 శాతం రెవెన్యూ విదేశాల నుంచి సమకూరుతోంది. టర్కీ, చైనాలకు జంతువులను సరఫరా చేస్తున్నాము. యూరోపియన్ దేశాలలో అమ్మకాల కోసం ఓ ప్రయత్నం జరుగుతోంది. అక్కడి భాగస్వామి కోసం వెతుకుతున్నాము. త్వరలోనే ఇందులో పురోగతి లభించనుంది. విదేశాల్లో వ్యాపార విస్తరణకు వీలుగా యెస్‌టాక్స్, మెడికా తదితర పలు అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లకు వెళ్తున్నాము. వచ్చే ఐదేళ్లలో ఈ రంగంలో భారీ వ్యాపారాన్ని చేరుకోగలమనే విశ్వాసంతో ఉన్నాము.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ వద్ద ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని డిసిఎం వ్యాను ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ మండలం కడియాల కుంటతండాకు చెందిన గోపాల్ నాయక్(47), అంజలి(42), స్వాతి(9) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. పెద్ద షాపూర్ సమీపంలోకి రాగానే వెనుకనుంచి అతి వేగంగా వచ్చి డిసిఎం వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హెచ్‌సియు ప్రొఫెసర్ పై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఐద్వా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతున్న థాయ్‌లాండ్‌కు చెందిన విద్యార్థినిపై ప్రొఫెసర్ లైంగిక దాడికి పాల్పడటాన్ని ఐద్వా రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఆదివారం ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. సభ్య సమాజం తలదించుకునేలా చదువు నేర్పే విద్యాలయాల్లో ఉన్నత చదువులు, చదువుతున్న వారికి కూడా వేధింపులు తప్పడం లేదని పేర్కొన్నారు. పుస్తకం కోసం బయటికి పిలిచి ప్రొఫెసర్ ఇలా ప్రవర్తించడం దేశానికే అవమానకరమని తెలిపారు. పాఠశాలల్లో తోటి విద్యార్థులు, లైంగిక దాడులకు పాల్పడటం, సౌత్ కొరియా యువతిపై ఇలాంటి ఘటనే జరగడం, కర్ణాటక పాఠశాలల్లో పిల్లల బ్యాగుల్లో కండోమ్స్, మద్యం దొరకడం వంటి ఘటనలతో సమాజం ఏమైపోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచంలో మన దేశ ప్రతిష్ట దిగజారి పోయేలా జరుగుతున్న ఈ ఘటనలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలనీ, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద ధర్నా చేస్తున్న బాధితులు

టీకా వికటించి చిన్నారి మృతి

- వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ.. రోడ్డుపై రాస్తారోకోకు దిగిన బాధితులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టీకా వికటించడంతో చిన్నారి మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం ఎడవల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన కారింగుల నాగమణిరాజు కుమారుడు (45 రోజులు) ప్రభుత్వ వైద్య సిబ్బంది ఉచితంగా అందించే టీకాలలో భాగంగా 45 రోజుల డోసు టీకాను శనివారం మండల కేంద్రంలోని రామలింగాపురంలో ఎఎన్ఎం పుష్ప వేశారు. టీకా వేసిన అనంతరం సాయంత్రం 6 గంటల నుంచి బాలుడు అస్వస్థతకు గురికావడంతో ఉదయాన్నే మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా.. డాక్టర్ పరీక్షించి బాలుని ఆరోగ్యం విషమంగా ఉందని నిర్ధారించడంతో ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ సిబ్బంది లేకపోవడంతో సూర్యాపేటలోని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లేలోపు బాలుడు మృతి చెందాడు. తిరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోగా.. మధ్యాహ్నం 12 గంటల వరకు ఆరోగ్య సిబ్బంది విధులకు రాకపోవడంతో ఆస్పత్రి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న బాలుడు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో టీకా వేయడంతోనే మరణించాడని ఆరోపించారు. గతంలో ఆపరేషన్ అయిన మహిళ కుట్లు ఇప్పించుకోవడం కోసం ఆరోగ్య కేంద్రానికి వెళ్లి కుట్లు ఇప్పమని సిబ్బందిని అడిగితే కుట్లు ఇప్పే కత్తెర కూడా లేదని సిబ్బంది సమాధానం చెప్పారని తెలిపారు. ఇంత నిర్లక్ష్యంగా ఆరోగ్య సిబ్బంది ఉండడంతోనే బాలుడు మరణించాడని ఆరోపించారు. వైద్య అధికారులు స్పందించకపోవడంతో సూర్యాపేట-దంతాలపల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్థానిక ఎస్ఐ ప్రసాద్ బాధితులకు న్యాయం చేస్తానని ఒప్పించి రాస్తారోకోను విరమింపచేశారు. వైద్యాధికారి డాక్టర్ నాగరాజు వివరణ కోరగా.. టీకాతోనే మృతి చెందినట్టు పోస్టుమార్టం రిపోర్టు వస్తే తమ సిబ్బంది బాధ్యత వహించి శిక్షకు అర్హులవుతారని తెలిపారు. కారింగుల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ నాగరాజు ఎఎన్ఎం పుష్పపై కేసు నమోదు చేశారు. ఆస్పత్రి ఆవరణలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తుంగతుర్తి సిఐ నాగార్జునగౌడ్, స్థానిక ఎస్ఐ వై.ప్రసాద్, మద్దిరాల ఎస్ఐ వెంకన్న బందోబస్తు ఏర్పాటు చేశారు.

త్రినాధరావు సన్మానిస్తున్న దృశ్యం

ఘంటసాల శతాబ్ది జయంతిని విస్మరించిన సినీ పరిశ్రమ

ప్రజాశక్తి - కల్చరల్

వేల పాటలను పాటలను పాడి తెలుగు వాసినీ పరిశ్రమ అభివది లో భసగస్వామి ఇన ఘంటసాల శత జయంతిని సినీ పరిశ్రమ విస్మరించి స్తబ్దతగా ఉండటం బాధాకరమని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి రమణ ఆవేదన వ్యక్తం చేశారు శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై ఆదివారంనాడు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో 365 రోజుల పాటు సామాజిక మాధ్యమం వేదిక గా త్రినాధరావు నిరాటకంగా ఘంటసాలకు స్వరార్చన చేసిన సందర్భంగా ఆయనకు గాన కంఠేరవ బిరుదుతో సత్కార సభ జరిగింది. ముఖ్య అతిధిగా డాక్టర్ రమణ పాల్గొని బిరుదు ప్రదానం చేసి మాట్లాడారు త్రినాధ రావు మానవీయత కల మధుర గాయకుడు అని అభినందించారు.

తెలుగు చిత్ర పరిశ్రమ రాబోయే కాలంలో ఎన్‌టిఆర్, ఎన్ఆర్ జయంతులు విస్మరించరని భావిస్తున్నానన్నారు. చిత్ర మంటేనే చిత్ర విచిత్ర పరిశ్రమ అని చమత్కారించారు. సాహితీ వేత్త డాక్టర్ పీ.మధుసూదనరావు అధ్యక్షత వహించిన సభలో గాన సభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి, రాగ మయి, దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు విజయ శ్రీ సంస్థచే ఘంటసాల జీవన సాఫల్య పురస్కారం తోను విశ్వ గురు వారిచే రెండు అంతర్జాతీయ రికార్డులను త్రినాధ రావు కు బహుకరించారు.

మోడీ హయాంలో ఎన్ని ఉద్యోగాలిచ్చారు

- బిజెపి నేతలకు షబ్బీర్ అలీ ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ హయంలో ఎన్ని ఉద్యోగాలు కల్పించారో రాష్ట్ర బిజెపి నేతలు చెప్పాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీని విమర్శిస్తున్న కెసిఆర్ మాత్రం చేస్తున్నదేమిటి? అని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను కెసిఆర్ ఎందుకు తగ్గించట్లేదని నిలదీశారు. స్వాతంత్ర్య పోరాటం, తెలంగాణ ఉద్యమంలో బిజెపి పాత్ర ఉందా? అని ప్రశ్నించారు. ఇడి విచారణకు సోనియా, రాహుల్ హాజరయ్యారని గుర్తు చేశారు. బిజెపి నేత బిఎల్ సంతోష్ సిట్ విచారణకు ఎందుకు హాజరు కావడం లేదన్నారు. సోనియా, రాహుల్ కంటే బీఎల్ సంతోష్ గొప్పవారా? అని షబ్బీర్‌అలీ ప్రశ్నించారు.